నాకూ, పిల్లలకీ పక్కలెయ్యి దబ్బున; చంటిది లేస్తుంది, ఎత్తుకుని ఆడిద్దుగాని."

'సిత్తం, అమ్మగోరు.'

... ... ... ...

... ... ... ...

ఆరుంబయట సోల్పుగా పక్కలు పరుస్తున్నాడు వెంకన్న, — మొదట అయ్యగారిపసుపు, దానిపక్కనే అమ్మగారిదీ, దాన్నిఆనుకుని ఆఖరున కుఱ్ఱాళ్లదీనూ. చాకలి కణ్ణియమ్మ అవ్వాళేతెచ్చిన మల్లెపువ్వుల్లాంటి తెల్లనిదుప్పట్లు మడుపులను విప్పి, చక్కగా చదునుగా పరుస్తున్నాడింకా—వెంకన్న. మేడమెట్లమీద కాళ్ల చప్పుడయింది గబగబా. ఎంకన్న మెడ వొంచి చూశాడు. సంతోషంగా కేకలేసుకుంటూ రొజుకుంటూ రొప్పుకుంటూ అమాంతంగా వొచ్చిపడ్డారు పక్కలమీద అప్పారావుగారి సంతానం, — ఆనందం, సుశీలాను, వెంకన్న దుప్పట్లింకా సాంతం పరచకముందే! పడి వొకరికింకొకళ్లు కిచకిచలెట్టుకుంటూ కిలకిల వెఱ్ఱిగా నవ్వుకుంటూ, గాలిలోకి కాళ్లెత్తుకుని తన్నుకుంటూ, అటునుంచి యిటు, యిటునుంచి అటూ పొర్లిగింతలువేయడం మొదలెట్టారువాళ్లు. ఎంకన్న కెక్కల్లేని

సంబరంపుట్టుకొచ్చింది, పిల్లల పొర్లిగింతలవల్ల పళ్లన్నీ బయటపడేటట్టు యికిలిస్తూ సకిలించాడు.

అట్టా తెల్లదుప్పట్లన్నీ తొక్కెయ్యకండి బాబు! అయ్యగోరు కొడ్తారు బాబూ!

ఆనందం—ఏడ్వావోయ్ వెంకాయ్! గింకాయ్! బెంకాయ్!

సుశీల!—నాన్నగారు కొట్టట్టా మన్ని!

ఆనందం—మన్ని కాడే అక్కోయ్! వాణ్ణే దంచుకుంటాగ్లే నాన్నగారు; మనకేం?

సు—పాపం! మనం తొక్కెయ్యడమూను, వెంకన్న దెబ్బలుతినడమూనూనా! వాణ్ణి కొట్టించావంటేనా!—చూస్కో యేం జేస్తానో.

ఆ—ఏంజేస్తావేం? మహా! ఎథవ్వొంకన్న మామంచివాడేం? నువ్వంటే ఆవెధవకి ఎక్కువాపేక; మరి నేనంటేనో? ఎప్పుడూ నీకేదో మిఠాయీ కొనిస్తూనే ఉంటాడు. నాకిచ్చాడూ?

సు—ఛా కుంకా! పాపం, వెంకన్న ఎంతమంచాడురా! నిజం చెప్పు. నీకు మిఠాయి కొనియివ్వలే?

ఆ—(గాలిలో కాళ్లెగరేసుకుంటూ) ఊ, ఊ, యిచ్చాల్లే—మహా! రెండుసార్లు. మరీ, నీ కవ్వాళ రంగులసబ్బుపెట్టెలు యిచ్చాడా; చెప్పు. నాకేవీ?

సు—ఛీ, సిగ్గులేదురా? మొగాళ్లకెందుకో సప్పెట్టె! అమ్మాయివా నువ్వు?

ఆ—అదుగో, అమ్మాయిని చేస్తున్నావ్ నన్ను. మొగ్గాణ్ణే నాకేం?

"ఒరేయ్! నీ భార్యపేరేమిట్రా?"

'.............................' (యికిలింపు)

"చెప్పు మరీ! చెప్తేగాని మిగతాఉత్తరం చదవను."

'ల—చ్చి' (సిగ్గుతో)

"మరి అరేయ్! లచ్చిని తీసుకరావేంరా; నీవొంటెనిగురించి బెంగపెట్టుకుంది పాపం!"

'డబ్బేదమ్మా లచ్చిని తోలుకరావడానికి? ఏంజేస్తుండదో! లచ్చి!'

సుశీల మళ్లీ గబగబా మిగతాజాబు చదవ నారంభించింది.—

"మీరు మొన్నమనార్డరు చేసిన పదకొండు రూపాయీల ఎనిమిదణాలు అందినై. ఈడ సంగతులు ఏమీ బాగాలేవు. అప్పలోళ్లు మమ్మల్ని చడ చంపుకు తింటున్నారు. మొన్న పేటనుంచి షాహుకారుగుమాస్తా సుబ్బారావుగారొచ్చి డబ్బుకు చాలా వొత్తిడి చేశిను. అయ్యగారి కాళ్లట్టుకుని కుయ్యోమొఱ్ఱోఅంటే, రెంణెల్లదాకా వాయిదా పెట్టారు. అప్పట్లోగా వడ్డీతో సహా ఋణంబాబతు నగదు అయిదువందల రూపాయీలు చిల్లిగవ్వతో చేర్చి చెల్లించకపోయేటట్టయితే మన గొడ్లూ గోదా, ఉన్న ఎకరన్నరపొలం షాహుకారు కట్టుకుపోతాడు. ఇంతపూ కష్టకాలం వచ్చింది.

ఏంచెయ్యాలో మాకేమీ తెలీటంల్లే. పాపం! అయ్యకు పెద్దతనం బాగావచ్చిండె; రానురాను కళ్ల మసకలు ఎక్కువౌతుండై. అమ్మవొంటెసంగతి అంతకంటే అధ్వాన్నం. అయ్యా, అమ్మ నిన్నెప్పుడూ తలుసుకుని యెక్కి యెక్కి ఏడుస్తరు. నువ్వు పట్టణాన నౌకరీకుదిరి యిప్పటికప్పుడే మూడేళ్లపై చిల్కపౌతుంది. మీదొరోరివద్ద ఓసెల సెలవుచ్చుకుని యీడకొచ్చి అయ్యనూ, అమ్మనూ సూసిపోతే బాగుంటది. నాఆలోచనకు నువ్వేమనేదీ తిరుగుటపాలో రాయగలవు. జరూరు.

విలాసం—కడియాల కామన్న కిచ్చేది. ఎలిమెంటరీ తాలూకా స్కూలుటీచరు, ఖమ్మం. (మొగలాయీ)"

అని కార్డుసాంతం చదివి వినిపించడం మానేసింది. ఎంకన్న బిక్కమొహం వేశాడు. అతని గుడ్లల్లోనుంచి దుఃఖాశ్రుబిందువులొకకొన్ని జాలువారి సుశీలచేతులమీద పడినవి; పడీపడటంతోటే సుశీల ఖంగారుగా బోయివైపు తిరిగింది. దిగాలబడి కంటతడి బెట్టుకునిఉన్న ఎంకన్నదీనమూర్తి ఆమె కంటబడింది; బోయి అట్లా అవడానికి కారణ మేమిటో ఆ అమాయిక యెరిగింది కాదు. ఆమె పలచని, చక్కని కోల మొహం సహజశోచిస్సు, సానుభూతి సూచకంగా విచారజీమూతసంఛాదితం అయింది. అమాయికంగా ఆఅమ్మాయికూడా యేడ్చింది 'ఆ — ఆ — ఆ' అంటూ ఆక్కండా, గ్రుక్కతిప్పకోకండా, ఎందుకో, కారణమేమీ తెలీకండా. ఇప్పటిదాకా పిల్లిమొగ్గలు వేసుకుంటూ గడబిడచేస్తున్న ఆనందమూను అల్లరికట్టిపెట్టి నోరు తెరచుకుని దిగాలబోయి ఎగాదిగ చూడటం మొదలెట్టాడు ఇద్దర్నీ —అక్కనూ, ఎంకన్నను. కాళ్లుచేతు లెగరేసుకుంటూ పొట్టమీద డేకుకుని వస్తోన్న బుజ్జి శీత కూడా డేకడంమానేసి కెవ్వున యేడ్పుసాగించింది.

"అరేయ్! ఎంకన్నా! ఏమిట్రా — ఆ రణగొణధ్వనం తా? పిల్లలేడుస్తున్నారేంరా —వెధవా! వాళ్లని మేడదించి తీసుకురా!"

